దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

- కనుల పండువగా చవితి ఉత్సవాలు
- వినాయక నామస్మరణతో మార్మోగిన పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాలు

పిఠాపురం: గణపతి నవరాత్ర ఉత్సవాలు సోమవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. వీధివీధినా మండపాలు ఏర్పాటు చేసి, వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామాలన్నీ వినాయక నామస్మరణలు హోరెత్తాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పిఠాపురం నియోజక పరిధిలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు తదితర మండలాల పరిధిలో సుమారు 250 వినాయక మండపాలు నిర్మించి చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పిఠాపురం కోట గుమ్మం సెంటర్లో ఉన్న జై గణేష్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ కాగా మంగళవావారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో అతి పెద్ద పాలవెల్లి భక్తులను అమితంగా ఆకట్టుకుంది. పలువురు భక్తులు వినాయక దీక్షలు స్వీకరించారు. జైగణేష్ ఆలయంలో పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. గ్రామోత్సవం కనుల పండువగా జరగగా పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదగయ క్షేత్రంలో ఉన్న చింతమణి గణపతికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వినాయక ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

సామర్లకోట: స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలోని గణపతి ఆలయంలో ఈఓ డి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. మధ్యాహ్నం మూషిక వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి రాంబాబు, భమిడిపాటి శ్రీనివాసులు భక్తులకు సేవలందించారు. బళ్లమార్కెట్ సెంటర్, మెహర్ కాంప్లెక్స్‌లలో వేంచేసి యున్న గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతినగరంలో 12 అడుగుల గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయా పందిళ్లను భక్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ దర్శించుకున్నారు.

పెద్దాపురం: పట్టణంలోని మెయిన్‌రోడ్డు, మున్సిపల్ సెంటర్, పాశిలివీధి, పాత పెద్దాపురం, బొమ్మల గుడి వీధి తదితర ప్రాంతాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో గణేషుడు విగ్రహాలను నెలకొల్పారు. రూరల్ ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో వీధి, వీధినా, పట్టణంలోని అన్ని వాడల్లో వినాయకుడు విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పట్టణంలోని స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను నెలకొల్పి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిస్తున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని నెలకొల్పగా చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న 16 అడుగుల మట్టి విగ్రహం

మండలంలోని కాండ్రకోటలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కోలా దుర్గ తయారు చేసిన 16 అడుగుల మట్టి గణపతి విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంది. మర్లావలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి వేడుకలను రాష్ట్ర కార్మిక నాయకులు, సామర్లకోట మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబులు ప్రారంభించారు.

ఘనంగా ప్రారంభమైన గణపతి నవరాత్రులు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్రులు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మందిరాలు ఏర్పాటు చేసి విద్యుద్దీపాలు, పూలతో అందంగా అలంకరించి గణేశుడిని ప్రతిష్ఠించారు. మండలంలో సుమారు 100కి పైగా వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేశారు. 3 అడుగుల నుంచి 15 అడుగుల వరకు భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వాకతిప్పలోని గణనాథుడిని వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు తదితరులు దర్శించుకున్నారు.


పిఠాపురంలోని గ్రామోత్సవంలో వినాయకుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


సామర్లకోట వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో గణపతికి పూజలు చేస్తున్న దవులూరి దొరబాబు


కాండ్రకోటలో ఆకట్టుకుంటున్న 16 అడుగుల మట్టి గణపతి


ప్రత్యేక అలంకారంలో పాదగయ క్షేత్రంలో చింతామణి గణపతి స్వామివారు


మూషిక వాహనంపై ఊరేగుతున్న గణపతి


వాకతిప్పలో గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

తీరప్రాంత పరిశీలన

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా విగ్రహాల నిమజ్జనాలను పురస్కరించుకొని ఉప్పాడ, కోనపాపపేట తీరప్రాంతాలను మంగళవారం పోలీసులు పరిశీలించారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటను చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ వివరించారు. ముఖ్యంగా నిమజ్జన సమయంలో భక్తులు తగిన జాగ్రత్తలపై మైకుల ద్వారా తెలియజేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్సై స్వామినాయుడు, తహసీల్దార్ ప్రసాద్ ఉన్నారు.

పంచాయతీ చట్టాలపై అవగాహన పెరగాలి

సామర్లకోట: పంచాయతీ చట్టాలపై కార్యదర్శులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. శిక్షణ కేంద్రంలో మంగళవారం జిల్లా పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల శిక్షణను ఆయన ప్రారంభించారు. కార్యదర్శులు తమ విధులను వికేంద్రీకరించడం ద్వారా పనులు వేగంగా పూర్తి చేయవచ్చునని తెలిపారు. పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, బి.ఆంజనేయులు ఎస్‌కే మోహిద్దీన్ శిక్షణ ఇచ్చారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్


చెత్తను తొలగిస్తున్న స్టేషన్ మేనేజర్, ఇతర సిబ్బంది

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో మంగళవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ వారోత్సవాల్లో భాగంగా స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు. ఇటీవల పారిశుధ్యంపై ఆర్‌ఎంయూ ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు ప్రత్యేక యంత్రాన్ని సరఫరా చేయగా, దానితో ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు. అనంతరం రైల్వే ట్రాక్‌లపై ఉన్న చెత్తను తొలగించారు. ప్రయాణికులు డస్టు బిన్‌లను ఉపయోగించాలని, ప్లాట్‌ఫారాలపై చెత్త వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని స్టేషన్ మేనేజర్ హెచ్చరించారు. స్టేషన్ మాస్టర్లు అనంతలక్ష్మి, శ్రీనివాస్, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల్లో జాగ్రత్తలపై శిక్షణ

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ, మూలపేట గ్రామాల్లోని సచివాలయాల్లో మంగళవారం కాకినాడ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. తుఫాన్లు, అగ్ని ప్రమాదాలు వంటి పలు ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను ఏ విధంగా రక్షించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ శిక్షణను డీఎల్‌పీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ అబ్రహం లింకన్‌లు ప్రారంభించారు.

ఎస్సై మూర్తి బాధ్యతల స్వీకరణ



సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సైగా పీవీఆర్ మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ సీసీఎస్ ఎస్సైగా పని చేస్తున్న మూర్తిని సామర్లకోట పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసిన విషయం విధితమే. ఇప్పటి వరకు ఎస్సైగా విధులు నిర్వహించిన టి.సునీత కాకినాడ వీఆర్‌కు బదిలీ అయ్యారు. డీఎస్పీ లతాకుమారి, సీఐ అబ్దుల్ రబ్‌లను, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును ఎస్సై మూర్తి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

రైల్వే డాక్టర్‌గా నాగార్జున

సామర్లకోట: రైల్వే డాక్టరుగా నాగార్జున మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా రైల్వే ఆస్పత్రిలో డాక్టరు పోస్టు ఖాళీగా ఉంది. దాంతో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేలా నాగార్జునను నియమించారు. ఆయన రెండేళ్ల పాటు కాంట్రాక్టు పద్ధతిలో రైల్వే ఆస్పత్రిలో పని చేస్తారు.

నేడు హుండీల లెక్కింపు

సామర్లకోట: పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం హుండీలను బుధవారం ఉదయం లెక్కిస్తున్నట్లు ఈఓ డి నాగమల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగే హుండీల లెక్కింపులో భక్త సంఘం నాయకులు, భక్తులు పాల్గొనవచ్చునని అన్నారు.

9 మందికి జరిమానా

సామర్లకోట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి మంగళవారం కాకినాడ కోర్టుకు హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి పలువురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆకతాయిలకు చెక్

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద మోటారు సైకిళ్లపై హల్‌చల్ చేస్తున్న ఆకతాయిలకు పోలీసులు చెక్ పెట్టారు. స్పందనలో పాఠశాలలు, కళాశాలల నుంచి వస్తున్న సమయంలో బాలికలను అల్లరి పెడుతున్నారని ఫిర్యాదుల మేరకు మంగళవారం సాయంత్రం పెద్దాపురం, సామర్లకోట పోలీసులు మోటారు సైకిళ్లపై వెళ్తున్న ఆకతాయిల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నిమజ్జనాల్లో నిబంధనలు పాటించాలి


సామర్లకోట గోదావరి కాలువలో గణేష్ ప్రతిమలు నిమజ్జనం చేసే ప్రదేశాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ తదితరులు

సామర్లకోట: గణేష్ నిమజ్జనాల సందర్భంగా ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని అదనపు ఎస్పీ పి.శ్రీనివాసు అన్నారు. మంగళవారం గణేష్ ప్రతిమలు నిమజ్జనం చేసే పంచారామ క్షేత్రం ముఖ ద్వారం వద్ద ఉన్న స్నానాల రేవును ఆయన పరిశీలించారు. ఉత్సవ నిర్వాహకులు నిమజ్జనాలు చేసే తేది, సమయాలను ముందుగా నిమజ్జన ప్రదేశం వద్ద నమోదు చేయించుకుని, ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గోదావరి కాలువలో నిమజ్జనం చేసే వారు పంచారామ క్షేత్ర ముఖ ద్వారా స్నానాల రేవు వద్ద మాత్రమే నిమజ్జనాలు చేయాలని సూచించారు. ఈ మేరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గోదావరి కాలువ రేవులో బారికేడ్‌లు ఏర్పాటు చేసి లైటింగ్, పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయడానికి క్రేన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై పీవీఆర్ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసినా జగన్‌ను ఏం చేయలేరు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- తాటిపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం


తాటిపర్తిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, స్థానిక నాయకులు

పిఠాపురం: వంద పార్టీలు కలిసి వచ్చినా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరు మాత్రమే నిలుస్తారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో చేనేత కుటుంబాలను కలిసి ప్రభుత్వం పథకాలు అందుతున్నాయా అంటూ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రజలను పలకరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరెవరికి ఏయే పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఆయనకు స్వాగతం పలికిన స్థానికులు తమ గ్రామంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఇళ్ల మధ్యనుంచి వెళ్లడం వల్ల పలు ప్రమాదాల బారిన పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలు అయ్యాకా మరో మాట మాట్లాడే నాయకులు మాదిరిగా కాదని సీఎం వైఎస్ జగన్ ఎప్పుడు ప్రజల కోసమే ఆలోచించే గొప్ప నాయకుడు అన్నారు. ఏ నాయకుడైనా ప్రజలకు నిజంగా సేవ చేస్తే ఆ ప్రజలే ఆ నాయకుడిని కావాలని కోరుకుంటారని అలాంటి నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ ప్రజల మనసులను దోచుకున్నారన్నారు. మళ్లీ ఆయనే సీఎంగా రావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారన్నారు. ఈసందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, ఎంపీటీసీ నూకరాజు, దాసం వెంకటేష్, గారపాటి బుజ్జి , మొగలి చిన్న, మొగలి రవి, నాయకులుపాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- పనసపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం


పనసపాడు గ్రామంలో లబ్ధిదారులకు వారు అందుకున్న లబ్ధిని వివరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని దీనిలో భాగంగానే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం వైస్ ఎంపీపీ ములసా శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు మానేపల్లి చిట్టిబాబు, బదిరెడ్డి బుజ్జి, కాళ్ల శ్రీనివాసు, అనుసూరి రమణల ఆధ్వర్యంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. హామీలు ఇవ్వని పథకాలు కూడా అమలు చేస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి అధికారులను కార్యక్రమంలో భాగస్వామ్యులను చేసినట్టు చెప్పారు. ఎంపీడీఓ డి శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి అమరనాథ్‌రెడ్డి పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు 2 పేర్నిడి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టి అందలం ఎక్కాలని ఆరాటం

- టీడీపీ, జనసేనలపై దవులూరి ధ్వజం
- అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీని గెలిపించాలని అభ్యర్థన


కట్టమూరులో పింఛన్ అందజేస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రజలను మభ్యపెట్టి అందలమెక్కేందుకు టీడీపీ, జనసేన పార్టీలు ఆరాటపడుతున్నాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కట్టమూరులో మంగళవారం నూతనంగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మండల కో–ఆప్షన్ సభ్యులు శేషకుమారి, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, ఉప్పటి ప్రసాద్‌లతో కలసి పంపిణీ చేశారు. సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దవులూరి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. మాజీ సీఎం చంద్రబాబు అవినీతి నిరూపణ అయిన తరువాతే చట్ట ప్రకారం ఆయనను అరెస్టు చేసినట్టు తెలిపారు. కావాలనే టీడీపీ, జనసేన పార్టీలో జైలులో మిలాఖత్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రంలో మోసపూరిత పాలన సాగించేందుకు పన్నాంగం పన్నాయన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో పింఛన్ లబ్ధిదారులందరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మూర్తి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లల గోవిందు, ఉప సర్పంచ్ బండారు చంటిబాబు, పెంటా విజయ్‌కుమార్, ఏలేటి అనంతలక్ష్మి, సిద్ధాంతపు ప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీ విజయమే ధ్యేయంగా పని చేయాలి

పార్టీ నూతన అధ్యక్షులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పార్టీ నూతనంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షులుగా నియమించిన వారికి సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీ అధిష్టానం పిఠాపురం నియోజకవర్గంలో మండల, పట్టణ అధ్యక్షులను నియమించింది. ఇప్పటి వరకు ఉన్న వారిలో కొందరిని మార్పు చేస్తు కొత్త వారికి అవకాశం ఇచ్చింది. పిఠాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా బొజ్జా దొరబాబును, గొల్లప్రోలు నగర పంచాయతీ అధ్యక్షుడిగా పని చేసిన పర్ల రాజాను తొలగించి ఆయన స్థానంలో మైనం రాజాను నియమించింది. నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండల పార్టీ అధ్యక్షులు అనాల సుదర్శన్, జవ్వాది నాయుడు, అరిగెల రామయ్యదొరలను కొనసాగిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నూతన అధ్యక్షులు మంగళవారం పిఠాపురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా గొల్లప్రోలు నగర పంచాయతీ వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుడు మైనం రాజా బైక్ ర్యాలీగా రావడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించుకోడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి జరిగిన మంచి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి బాబ్జి, మొగలి జయబాబు, దాసం పూసలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీపాద జయంతి మహోత్సవాలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు


పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ దత్త పుణ్య క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ జయంతి మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. వేలాది మంది భక్తులు, మరాఠీలు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి అధిక సంఖ్యలో సంస్థానానికి తరలివచ్చే భక్తులకు కోసం మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అనేక వసతి సముదాయాలు నిర్మించామని మరిన్ని నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పిఠాపురం: గొల్లప్రోలు ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. ఈ సభకు హాజరైన ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఉపాధ్యాయులు ఆర్.విమలకుమారి, ఎం.సూర్యచక్రసాయిబాబు, పి.విజయశంకర్‌లను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, ఎంపీడీఓ డీఎల్‌ఎస్ శర్మ, ఎంఈఓ ఎస్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మొగలి బాబ్జి, అరిగెల రామయ్యదొర, ఉపాధ్యాయులు, యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన

- ఎస్పీ సతీష్‌కుమార్
- వివిధ సమస్యలపై పలువురి ఫిర్యాదు


సామర్లకోటలో క్రైమ్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

సామర్లకోట: ప్రజా సమస్యల పరిష్కారానికే మండల స్థాయి స్పందన నిర్వహిస్తున్నట్టు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్పందనకు ఆయన పాల్గొని స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అంతకు ముందు ముఖ్య కూడళ్లు, రైల్వే స్టేషన్ ఆవరణను పరిశీలించారు.

ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఎస్పీని కలిసి వేట్లపాలెం పంచాయతీలో జరిగిన అవినీతికి సంబంధించి స్టేషన్‌లో జిల్లా స్థాయి అధికారులు ఫిర్యాదు చేసినా కేసులో పురోగతి లేదని, పట్టణ పరిధిలో వివిధ పాఠశాలల విద్యార్థులు వేచి ఉంటున్న ప్రసన్నాంజనేయనగర్, సీబీఎం సెంటర్లలో ఆకతాయిలు విద్యార్థులను అల్లరి పెడుతున్నారని జిల్లా మానవహక్కుల సంఘ నాయకులు నూతలపాటి అప్పలకొండ, ఎస్.రెహ్మాన్, జుత్తుక అప్పారావు ఎస్పీకి వివరించారు. పట్టణంలో వన్ వే ట్రాఫిక్ అమలు చేయాలని మానవహక్కుల సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు.

సామర్లకోటలోనే క్రైమ్ పోలీసు స్టేషన్..

స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ఖాళీగా ఉన్న కౌన్సెలింగ్ భవనంలో క్రైమ్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ప్రారంభించారు. పెద్దాపురంలో కొనసాగుతున్న క్రైమ్ పోలీసు స్టేషన్ సామర్లకోటలోనే ఉండడం ఉత్తమని ఆయన భావించారు. రైల్వే స్టేషన్‌తో పాటు, ఏడీబీ రోడ్డు అందుబాటులో ఉండడం వలన నేరస్తులు తప్పించుకొనే అవకాశాలు ఉన్న కారణంగా క్రైమ్ స్టేషన్‌ను సామర్లకోటలో ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. డీఎస్పీ లతాకుమారి, సీఐలు కె.దుర్గాప్రసాద్, అబ్దుల్ నబీ, ఎస్సై పీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కొత్తపల్లి: గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా సొంత ఊరిలోనే వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా టీబీ, లెప్రసీ ప్రోగ్రాం అధికారి రమేష్ అన్నారు. అమినాబాద్‌లో మంగళవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి వైద్యాధికారి సుష్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామంలో వైద్యులు ఇంటికే వచ్చి అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులను అందించే సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందన్నారు. దీనిలో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటింటికీ వలంటీర్లు , వైద్య సిబ్బంది వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి అవసరమైన వైద్యసలహాలను ఇచ్చి వైద్య శిబిరాలకు పంపిస్తారన్నారు.

భక్తే ప్రధానంగా ఉత్సవాలు


ఉత్సవ కమిటీని సత్కరిస్తున్న నిర్వాహకులు

పిఠాపురం: సనాతన ధర్మంలో తొలి పూజలు అందుకునే వినాయకుడి నవ రాత్రి ఉత్సవాలు భక్తి పూర్వకంగా ఉండాలి తప్ప వేరే విధంగా ఉండకూడదని శ్రీబాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవ కమిటీ హిందువులకు ఉత్సవ నిర్వాహకులకు సూచించింది. పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభ ఆటో టవేరా యూనియన్ ఆధర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా శ్రీబాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు వినాయక మండపాన్ని మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయనను ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్కరు వినాయక ఉత్సవాలను భక్తికి మాత్రమే చోటు ఇచ్చి జరుపుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీబాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, శ్రీపాద శ్రీవల్లభ ఆటో టవేరా యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ఫ్యాన్ల వితరణ

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సీపీడీసీ సభ్యురాలు ఐ కుమారి రెండు ఫ్యాన్లు బహూకరించారు. మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ పి.సుభాసినికి ఆ ఫ్యాన్లు ఆమె అందజేశారు. సీపీడీసీ శక్రటిరా ప్రభు, ఇతర సభ్యులు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల సర్వే

పెద్దాపురం: నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో నూరు శాతం సర్వే పూర్తి చేసినట్టు నియోజకవర్గ ఈఆర్‌ఓ, ఆర్డీవో జేఎస్ రామారావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం పలు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సర్వేపై అవగాహన కల్పించారు. ఫారం 6,7,8, సంబంధించి 22,805 దరఖాస్తులు రాగా, 20,468 క్లెయిమ్‌లు పరిష్కరించామని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.